తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## వెంకన్న ఆశీస్సులందుకున్నాం





తిరుమల, అక్టోబర్ 30ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సినీదర్శకుడు రాఘవేంద్రరావు, హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్ ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రకృతి వ్యవసాయ రైతులు

# ముందుకు రావాలి

### -భవిష్యత్తుకు, భక్తులకోసం సహకారం అందిద్దాం
### -టిటిడి ఈఓ, జిల్లా కలెక్టర్



తిరుపతి, అక్టోబర్ 30ప్రభాతవార్త: సేంద్రీయ విధానంలో పండించిన పంటల కూరగాయలను, పశుగ్రాసాన్ని టిటిడికి సరఫరా చేయడానికి రైతులు ముందుకు రావాలని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి కోరారు. శ్వేత భవనంలో సోమవారం రైతు సాధికార సంస్థ అధికారులు,ప్రకృతి వ్యవసాయ రైతులతో టిటిడి, జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. టిటిడి నిర్వహిస్తున్న ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని తిరుపతి, పలమనేరు, నెరబైలు వద్ద కమలయ్యగారిపల్లి గోశాలలకు రోజుకు 30టన్నుల పశుగ్రాసం అవసరమవుతుందన్నారు. ఈ పశుగ్రాసాన్ని సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించాలని, టన్నుకు 2వేల రూపాయలు పైగా ధర చెల్లిస్తామని ఇఓ ధర్మారెడ్డి తెలిపారు. రసాయన ఎరువులు వాడకుండా ఘనజీవామృతం, ద్రవ జీవామృతం ద్వారా పండించాలన్నారు. సంవత్సరం పొడవునా పశుగ్రాసాన్ని, కూరగాయలను టిటిడికి సరఫరా చేసేలా రైతులతో ఒప్పందం చేసుకుంటామన్నారు. రైతుల పొలాల వద్దకే వెళ్ళి సేకరిస్తామని, రవాణా ఖర్చులు కూడా టిటిడినే భరిస్తుందని చెప్పారు. పశుగ్రాసం, కూరగాయలు ఒప్పందం చేసుకోవడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు. టిటిడి జెఈఓ సదాభార్గవి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్లు షణ్ముగం, వాసు, ఎస్వీగోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

### తిరుమలేశుని తరహాలోనే నిర్వహణ
### 14న గజవాహనం,18న పంచమీతీర్థం



తిరుమల/తిరుచానూరు,ప్రభాతవార్తప్రతినిధి: కార్తీకమాసంలో ప్రతి ఏటా నిర్వహించే తరహాలోనే ఈ ఏడాది పద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరిపిస్తామని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి వెల్లడించారు. తిరుమలలో దేవదేవునికి నిర్వహించే ఉత్సవాల తరహాలోనే తిరుచానూరు అమ్మవారి ఉత్సవాలు ఉంటాయన్నారు. నవంబర్ 10వతేదీ నుండి 18వరకు తొమ్మిదిరోజులు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 9వతేదీ గురువారం సాయంత్రం అంకురార్పణ, 10వతేదీ శుక్రవారం ధ్వజారోహణం, 14న మంగళవారం గజవాహనం, 15న బుధవారం ఉదయం స్వర్ణరథం,రాత్రికి గరుడవాహనం, చివరగా 18వతేదీ శనివారం అమ్మవారి పంచమీతీర్థం ఘట్టాలు ఉంటాయి. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి వాహనసేవల బుక్‌లెట్‌ను సోమవారం తిరుచానూరు అమ్మవారి ఆలయం వద్ద టిటిడి బోర్డు సభ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, జఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, పాంచరాత్ర ఆగమసలహాదారుడు శ్రీనివాసాచార్యులు, టిటిడి పిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఆవిష్కరించారు. అమ్మవారికి అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు, ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.

## సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై శివపార్వతులు





చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : ముక్కోటి ఉత్సవాలలో ఆది దంపతులైన శివపార్వతులు సోమవారం సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ముక్కోటి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం వేకువజామున స్వామి వారికి అభిషేకం జరిపించి, విశేష అలంకరణ గావించారు. ఉదయం 8 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణలతో సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల శివనామస్మరణల నడుమ మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణలో ఆదిదంపతులు విహరించారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు శివపార్వతులు చంద్రప్రభ వాహనంపై అధిష్టించి ఆలయ ప్రదక్షిణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## బంగారు తాపడంకు రాగిరేకుల నమూనాల పరిశీలన



రాగి రేకుల డిజైన్ నమూనాలను పరిశీలిస్తున్న దాత సమన్వయకర్త, ఆలయ ఛైర్మన్, ఈఓలు

కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం ద్వారాలకు బంగారు తాపడంకు సిద్ధం చేసిన రాగి రేకుల డిజైన్ నమూనాలను దాత ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులతో కలసి సోమవారం ఆలయంలో పరిశీలించారు. సుమారు వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయాన్ని దాతలు ప్రవాస భారతీయులైన విజయవాడకు చెందిన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్‌లు సుమారు 10 కోట్లు రూపాయలతో శిల్పకళ ఉట్టిపడే విధంగా పునర్నిర్మాణ చేసి గతేడాది భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే వారు నూతన ఆలయం ద్వారాలకు సుమారు 6.60 కోట్లు రూపాయలతో బంగారు, వెండి తాపడం పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు ఆలయంలోని గర్భాలయం, అంత్రాలయం ద్వారాలకు 3.50 కోట్లు రూపాయలతో బంగారు తాపడం, 3.10 కోట్లు రూపాయలతో అర్ధమండపం ద్వారాలకు వెండి తాపడం పనులు చేసేందుకు ముందుకు రావడంతో గత కొద్ది రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బంగారు తాపడం పనులకు రాగిరేకుల డిజైన్ నమూనాలను సిద్ధం చేశారు. వీటిని దాతల సమన్వయకర్త కొట్టిపాటి రామకృష్ణప్రసాద్ ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులతో కలసి పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, మాజీ సీఎఫ్ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హతమార్చిన భర్త





మృతి చెందిన గర్భిణీ పావని, పోలీసుల అదుపులో నిందితుడు

వరదయ్యపాలెం, అక్టోబర్ 30, ప్రభాతవార్త
ఓ గర్భిణిని తన భర్తే హతమార్చిన సంఘటన వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం హరిజనవాడలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాలు మేరకు.. బత్తలవల్లం హరిజ వాడకు చెందిన కాటయ్య గత ఎనిమిది సంవత్సరాల క్రితం ఇరకం పావనీ (26)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం కాటయ్య తన భార్యను హతమార్చిన సంఘటనతో గ్రామస్తులు భయబ్రాంతులకు గురయ్యారు. గ్రామస్తుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ శివకుమార్ రెడ్డి, ఎస్ఐ నాగార్జున్ రెడ్డి హత్య జరిగిన పరిసరాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వివాహిత మృతదేహాన్ని సత్యవేడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సిఐ మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. భార్యభర్తల మధ్య సరైన సత్సంబంధాలు లేవని గ్రామస్తులు తెలిపిన నేపథ్యంలో హత్యకు గల కారణాలు, కారకులు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు కాటయ్యను పోలీసులు అదుపులో తీసుకున్నారు.

# చెరుకు బకాయిలు వెంటనే చెల్లించాలి

### నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులు డిమాండ్

నింద్ర, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు బకాయిలు వెంటనే చెల్లించాలని చెరుకు రైతుల అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేసారు. సోమవారం మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద చెరుకు రైతులు నేతమ్స్ షుగర్ స్వాదీనం చేసుకోవడానికి వచ్చిన ఫైనాన్స్ కంపెనీ అడ్వకేట్‌ను రైతులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 2019 వసంవత్సరం నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెల్లించవలసిన 36కోట్లు బకాయిలు నాలుగు సంవత్సరాలుగా చెల్లించకుండా యాజమాన్యం రైతులను చాలా ఇబ్బందికి గురి చేస్తున్నారని విమర్శించినారు. రైతులకు చెల్లించవలసిన బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వలన యాజమాన్యం కూడా రైతులకు సరియైన సమాదానం చెప్పడం లేదని అదే విధంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా యాజమాన్యంకి వత్తాసు పలకడం వలననే రైతులకు న్యాయం జరగడం లేదని అన్నారు. సోమవారం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధిగా న్యాయవాది ద్వారా ఫ్యాక్టరీ స్వాదీనానికి రావడంతో రైతులందరు మూకుమ్మడిగా గో బ్యాక్ అడ్వకేట్ కమిషన్ అంటూ రైతులు నిరసన తెలియజేయడంతో వచ్చిన కమిషన్ అడ్వకేట్ వెనిదిరిగి వెళ్ళిపోయారు. రైతులు మాట్లాడుతూ రైతులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించే వరకు మాపోరాటం ఆగదు అని గట్టిగా హెచ్చరించినారు. ఫైనాన్స్ కంపెనీలు ఫ్యాక్టరీని స్వాదీనం చేసుకొవడానికి వస్తే రైతులు వాటిని చూస్తా వుండరని వారిపై తిరగబడి ప్రతిఘటిస్తారని అన్నారు. ఇకనైన రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు చెల్లించవలసిన బకాయిలను ఇప్పించడానికి కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు యాదవ్, రఘునాద్‌రెడ్డి, సుదర్శనంనాయుడు, రాజగోపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్దన్, సిఐ వాసంతి, యస్ఐ శివశంకర్, రైతులు తదితరులు పాల్గోన్నారు.



ఫైనాన్స్ కంపెనీ అడ్వకేట్‌ను అడ్డుకుంటున్న రైతులు

## బోయకొండపై రూ. 2కోట్లతో సోలార్ విద్యుత్ ప్లాంటు

### -ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 30 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండ కింద ఆలయ నిధులతో ఎన్ఆర్ఇడిసిఎపి ద్వారా రూ. 2కోట్లతో సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ధర్మక్తల మండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమవారం కొండపై నూతన ఆలయ ధర్మకర్తల మండలి తొలి సమావేశం ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకొన్నారు. ప్రతి శుక్రవారం అమ్మవారి సన్నిధానంలో రాహుకాలాభిషేకం అనంతరం 200మంది భక్తులకు అన్నదానం, కొండ కింద యాత్రీకుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన సిమెంట్‌రోడ్లు, ఫంక్షన్‌హాల్స్, గెస్టుహౌస్‌లు వంటి వాటిని పరిశీలించి త్వరితగతిన నిర్మాణానికి తీర్మానించారు. అదే విధంగా సిబ్బందితో సమావేశమై పలు నిర్ణయాలు తీసుకొన్నారు. కొండపై అమ్మవారి సన్నిధానంలో పనిచేసే అర్చక, అధికార, సిబ్బంది మొబైల్ ఫోన్లు వినియోగించరాదనీ, భక్తులతో భక్తిభావంతో మెలిగి మంచి పేరుతేవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇఓ చంద్రమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు పవన్‌రాయల్, రజని, భారతి, రాందాసు, బుడ్డమ్మ, రాజేష్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, హైమావతి, రెడ్డెమ్మ, ఎక్స్అఫిషియో సభ్యుడు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పార్కులు పరిశుభ్రంగా ఉండాలి : కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త



తిరపతి నగరంలో మనిసిపల్ కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న పార్కులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకో వాలని తిరుపతి నగరపా లక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు, స్వీక రించే స్పందన కార్య క్రమంలో కమిషనర్ హరిత పాల్గొన్నారు. డయుర్ కమిషనర్‌కు 22 అర్జీలు 26 పిర్యాదులు అందగా వాటిలో ప్రధానంగా ప్రకాశం పార్కులో మురుగుదోడ్ల సరిగా లేవని నీళ్లు ఎప్పుడు లీక్ అవుతుంటాయని పిర్యా ్యదులు అందాయి. దీంతో కమిషనర్ స్పందిస్తూ ప్రతిపార్కు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చర్యలు తీసుకొవాలని ఆదేశించారు. ఎస్వీమెడికల్ కళాశాల ప్రాంతాంలో ఆరు చోట్ల స్పిడ్ బ్రెకర్లు వేయించాలని, కోరారు. శివ జ్యోతి, నగర్‌లో పాములు వస్తున్నాయని అక్కడ చెత్తా చేదారం వేస్తున్నారని పిర్యాదు చేశారు. వెంటనే తగు చర్యలు తీసుకొవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపకమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిపిల్ ఇంజినీర్లు, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, కెఎల్, వర్మ, సేతుమాదవ్, సెక్రటిరి రాధక, సిటి ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్, డాక్టర్, నాగేంద్ర రెడ్డి, మేనేజర్, చిట్టిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబుని రిమాండ్‌కు పంపి సైకో ఆనందం పొందుతున్న ప్రభుత్వం

### కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి



గూడూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త
చంద్రబాబు నాయుడుని రిమాండ్‌కు పంపి రాష్ట్ర ప్రభుత్వం సైకో ఆనందం పొందుతున్నదని కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. మీడియాతో వారు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్‌లో అవినీతి జరిగిందని చంద్రబాబును రిమాండ్‌కు పంపి ఇంత వరకు ఆధారాలు చూపించలేదని అన్నారు. బాబుని అక్రమంగా రిమాండ్‌కు పంపడం వల్ల భువనేశ్వరి, బ్రాహ్మిణిలు బయటకు వచ్చి తిరుగుతున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో అధికారంలోకి రాగానే ప్రభుత్వం చేయబోయే సంక్షేమాల గురించి మహానాడు రోజున మినీ మ్యానిఫెస్టోని తమ నాయకుడు విడుదల చేసారన్నారు. నవంబర్ 1వ తేది నుండి భవిష్యత్‌కి గ్యారెంటీ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో పర్యటించి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను మన నాయకుడు చేయబోయే అభివృద్ధి సంక్షేమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పులిమి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, పాదర్తి కోటేశ్వర రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, దువ్వూరు రవీంద్ర రెడ్డి, రాధా రెడ్డి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకే టిడిపితో జనసేన పొత్తు

### జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య



తిరుపతి టౌన్, అక్టోబర్ 30, ప్రభాతవార్త
ప్రజాస్వామ్యన్ని తిరిగి పరిరక్షించుకొనేందుకు తెదేపా తో తమ పార్టీ పొత్తు పెట్టుకుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య అన్నారు. సోమవారం టిడిపి చిత్తూరు జిల్లా కార్యాలయాలంలో జరిగిన టిడిపి, జనసేన సమన్వయ కమిటి సమావేశానికి పార్టీ పరిశీలికులగా విచ్చేసి ఆయన ప్రసగించారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలలకాంలోనే ప్రజల్లో వ్యతేరేకత మొదలైందన్నారు. స్దానిక సంస్థ ఎన్నికల్లో నామినేషన్ కూడా వేయనీయకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకొన్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తెదేపా ,జనసేన కలిసి ఎన్నికలకు వేళ్లుతున్నందన వైకాపా కు సున్నా వస్తుందన్నారు. ఉమ్మడిజిల్లాలో అభ్యర్దులను గెలిపించుకొనేందుకు రెండు పార్టీలు శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తాయన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ సిఎం అయ్యేందుకు ఆయన వద్ద ఉన్న ధనం, దౌర్జన్యాలను ఆయధాలగా ఆమర్చుకుంటున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన తరుపున పాల్గన్న తిరుపతి ఇన్‌చార్జీ కిరణ్ రాయల్ , పిలేరు ఇన్‌చార్జీ దినేష్, యుంగధర్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, తెదేపా పరిశీలకులు బీద రవచంద్ర, జిల్లా అధ్యక్షులు పువివర్తినాని, మాజి మంత్రి అమర్‌నాద్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పరసారత్నం, శంకర్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహాయాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాజసంహాలు, మునిరత్నం, కొదండయాదవ్, మాజీ శాసన సభ్యులు, సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ కుటుంబంను ఆదుకుంటాం
### - ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె

వెదురుకుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :



విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన జూనియర్ లైన్‌మేన్ హరీష్ కుటుంబంను అన్నివిధాల ఆదుకుంటామని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె మహిళ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని ఆళ్ళమడగు దళితవాడకు చెందిన మణెయ్య బుజ్జి దంపతులకు ముగ్గురు కుమారులు వారిలో పెద్ద కుమారుడు ఆళ్ళమడుగు సచివాలయం పరిధిలోఎనర్జీ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఆదివారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె సోమవారం ఆళ్ళమడుగుకు చేరుకుని మృతదేహంకు పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామిఇచ్చారు.ఆమె వెంట మండల వైసీపీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు లోకనాథ రెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షురాలు కామసాని భారతి, వైసీపీ నాయకులు దామోదరం రెడ్డి, ధనంజేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

సదుం, అక్టోబరు 30 ప్రభాతవార్త




మండల పరిదిలోని కంభంవారిపల్లె పంచాయతీ గాండ్లపల్లెలో సోమవారం సాయంత్రం సదుం పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మారుతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమహక్కులను గుర్తెరిగి మసలుకోవాలన్నారు. హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. అర్హులైన వారు పిర్యాదు చేయాలని చెప్పారు. అదేవిధంగా గ్రామస్థులు తమ గ్రామంలోని స్మశానం ఆక్రమనకు గురైందని దానిని తొలగించాలని కోరారు. గ్రామానికి ఉన్న దారి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్థంభానికి సంబందించిన సమస్యను పరిష క్రించమని కోరారు. గ్రామంలో భూమిలేని దళితులకు భూములను పంపిణీ చయాలని వినతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వో జ్యోతి, సర్వేయర్ మధు, మండల అంబేద్కర్ దళిత సంఘం గౌరవాధ్యక్షులు మందా సీతాపతి తదితురులు పాల్గొన్నారు.

## గుండె జబ్బు బాధితునికి ఆర్థిక సాయం



తవణంపల్లె, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

ఆపదలో వున్న వారికి నేనున్నా... అంటూ తన వంతు సాయం అందిస్తూ దాతృత్వాన్ని చాటుకుంటోంది మండలంలోని అరగొండ మాజీ సర్పంచ్, మండల వైకాపా నాయకురాలు ఎ.రాజేశ్వరమ్మ. వివరాల్లోకి వెళితే... అరగొండ గ్రామపంచాయతీ నల్లప్పరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్.శివప్రసాద్ అనే వ్యక్తి గత కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఇతను వైద్యం కోసం పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన రాజేశ్వరమ్మ బాదితునికి అండగా నిలిచారు. అతని వైద్యఖర్చుల కోసం 10 వేల రూపాయలను ఆర్థికసాయంను అందజేశారు. ఈమొతా _న్ని శివప్రసాద్ భార్య సునీతమ్మకు సోమవారం అందజేశారు. దాత రాజేశ్వరమ్మకు శివప్రసాద్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల ఆరోగ్యంపై సిఎం జగనన్న ప్రత్యేక చొరవ
### - మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త

రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యంపై సిఎం జగనన్న ప్రత్యేక చొరవ చూపుతున్నారని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కొత్తపేట 14,15వార్డుల్లో వైస్ ఛైర్మన్ మునస్వామి అధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రజలకు ఉచితంగా మందులు, మాత్రలు అందించడం జరుగుతోందన్నారు. ప్రతి వార్డు పరిధిలో సురక్ష శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా పేదల ఆరోగ్యంకు సిఎం జగనన్న భరోసా కల్పిస్తున్నారన్నారు. గతంలో కొత్తపేట ప్రాంతం అభివృద్ధి జరగలేదని వైకాపా ప్రభుత్వ హయాంలోనే అనేక అభివృద్ధి పనులను వైస్‌ఛైర్మన్ మునస్వామి అధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. అనంతరం హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గణపతి, అరవింద్, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్, కార్యదర్శి తాండవ కృష్ణ, ఆ ంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవర్ సంఘంచే పెద్ద ఎత్తున అన్నదానం

కుప ్పంరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గ దేవర్ సంఘం అధ్వర్యంలో ఎపి పిరమలై కల్లర్ తేవర్ సంఘంఅధ్వర్యంలో దేవర్116వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవర్ చిత్రపటానికి పూజలు చేశారు. దేవర్ సంఘం అధ్యక్షుడు పి.శివ అధ్వర్యంలో ఈసందర్భంగా ప్రైవేట్ బస్టాండు ఆవరణలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం జరిపారు. కార్యక్రమాల్లో తెదేపా రాష్ట్ర నేత డా॥ బిఆర్‌సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేం ద్రశేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, నేతలు ఆర్‌ఆర్ రవి, మంజునాథ్, వినోద్, దివాకర్, ప్రకాష్, సంఘం నేతలు కార్తీక్, ప్రకాష్, మురుగ, ఉదయ్‌కుమార్, పచ్చప్పన్, దామోదర్, పాండి, వీరన్, సెల్వం పాల్గొన్నారు.

## సుద్దలకుప్పంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

వి.కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

మండలంలోని సుద్దలకుప్పం సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 289మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మాధవి, హేమసాయి, పవన్, విజయ్‌కాంత్, సర్పంచ్ దామోదర్, వైస్ ఎంపిపి లక్ష్మణ్రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీదేవి ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ రాధాకృష్ణరెడ్డి, రెస్కో డైరెక్టర్ భూపతి, ఎంపిటిసి రామరత్నమ్మ, ఎంపిడిఓ మహ్మద్ రఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిది




కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త:

పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. కాణిపాకం హైస్కూల్‌లో కెఎన్ఆర్ తిరుమల ఇన్‌ఫ్రా ప్రయివేటు లిమిటెడ్ సంస్థ వారు పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సుమారు ఆరు లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటుచేసిన వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారంను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాదించాలని పిలుపునిచ్చారు. అలాగే సంస్థ హెడ్ కె.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ చిన్నతనం నుండే చదువుతో పాటు సమాజ సేవలను అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమానికి హాజరైన మరో అతిథి సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మేఘన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరసరాల పరిశుభ్రత పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, సురేంద్రబాబు,సురేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడకారులకు పూర్వ విద్యార్థి క్రీడ దుస్తులు వితరణ

వెదురుకుప్పం, అక్టోబర్ 30 ప్రభాతవార్త :



మండలంలోని తిరుమలయ్యపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూడో, రెజ్లింగ్ పోటీలలో పాల్గొనే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాం దుస్తులను ఆ పాఠశాల పూర్వ విద్యార్థి చాణిక్య అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో క్రీడపట్ల ఆశక్తితో పాల్గొని రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడంకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.దాతల ప్రోత్సహంను అందుకుని విద్యార్థులు క్రీడలతో పాటు చదువులలో రాణించి గుర్తింపు తెచ్చుకోవలని చూచించారు. క్రీడలలో రాణిస్తున్న విద్యార్థులకు దాత పదివేల రూపాయలు విలువ చూస్తే క్రీడ దుస్తులు అందజేశారు.అనంతరం దాత పూర్వ విద్యార్థి చాణిక్యను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు దుశాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ త్రిలోకసుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సిద్ధవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష



కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

కోట మండలం సిద్ధవరం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి దాసరి అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భవాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు వాలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు వెళ్లి ఎవరెవరికి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో ముందుగా గుర్తించి అటువంటి వారిని శిబిరాలకు తీసుకొచ్చి వారికి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం ఎంపిపి దాసరి అంజమ్మ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్రంలో పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## తడలో విద్యాశాఖ ఆధ్వర్యాన సీస్ సమావేశం

తడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త




స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్)లో భాగంగా తడ మండలంలోని ఎంపిక చేసిన అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సంబంధించి సోమవారం సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 3, 6, 9 తరగతులలో చదువుతున్న విద్యార్థులకు నవంబర్ 3న పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకుగాను ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లుగా డిగ్రీ విద్యార్థులకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ సర్వే ముఖ్య ఉద్దేశం విద్యావ్యవస్థ బలాలు, బలహీనతలను గుర్తించడమని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు సరస్వతి, మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు సురేష్, సిఆర్‌పిలు బాలరాజు, గోపీనాథ్, మునుస్వామి, మునేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త

రాష్ట్ర విద్యాశాఖ అచీవ్‌మెంట్ సర్వే కోసం విద్యార్థుల్లో సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం నవంబర్ 3న పరీక్ష నిర్వహిస్తుందని ఎంఇఓ మస్తానయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక ఎంఆర్‌సి భవనంలో ప్రధానోపాధ్యాయులకు, డిగ్రీ విద్యార్థులకు ఈ అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వం సర్వే నిర్వహిస్తుందని చెప్పారు. బాలల మేధస్సును వెలికి తీసేందుకు నైపుణ్య సామర్థ్యం ఎంత ఉందనే దానిపై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 3, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రాథమికంగా ఈ పోటీలు ఉంటాయని తెలిపారు.

## విద్యార్థులకు యూనిఫాం వితరణ

గూడూరు, అక్టోబర్ 30, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా యూనిఫాంను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఒక జత యూనిఫాంకు ఒక్కొక్కరికి 400 రూపాయిల వంతున మొత్తం 150 మందికి 60000 రూపాయిల విలువ చేసే యూనిఫారమ్‌లు అందజేసారు. ఈ కార్యక్రమానికి దాతగా సప్తగిరి చేపలపల్లి వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని, దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నారాయణ రాజు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు వృత్తికే ఎన్‌వి నారాయణ ఆదర్శం
### ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలక్ష్మి

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త



ఉపాధ్యాయ వృత్తికే ఆంగ్ల ఉపాధ్యాయులు ఎంఏ నారాయణ ఆదర్శం జడ్పి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ స్వర్ణ లక్ష్మి తెలిపారు. జడ్పి బాలికల పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుల పని చేస్తున్న ఎంఏ నారాయణ అన్న ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఎమ్మెల్యే పర్వత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సత్కరించిన సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయ బృందం వారు అభినందనలు తెలిపి సత్కరించారు. ఎంఏ నారాయణ సేవ దృక్పథం కలిగిన ఉపాధ్యాయులుగా ఎంపి కావడం ఆశించదగ్గ విషయమని హెచ్ఎం తెలిపారు. ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు.

## సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కౌన్సిలర్ నారాయణ

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త



పట్టణంలోని నాలుగవ వార్డులో 25 లక్షల రూపాయిలతో నిర్మించే సిమెంట్ రోడ్డు, సైడ్ కాలువ పనులకు కౌన్సిలర్ ఎంఏ నారాయణ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు డెవలప్మెంట్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి నిధులను మంజూరు చేయించినట్లు కౌన్సిలర్ తెలిపారు. రాంకుమార్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాఆం కుమార్ రెడ్డి సహాయ సహకారంతో నాలుగవ వార్డును అభివృద్ధి చేస్తానని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుని, వార్డుల్లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న
### సిఐ సంగమేశ్వర రావు

వెంకటగిరి, అక్టోబర్ 30, ప్రభాతవార్త



అన్ని దానాలకన్నా రక్తదానం మిన్న అని సిఐ సంగమేశ్వర రావు తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సంగమేశ్వర రావు ఆధ్వర్యంలో వెంకటగిరి సర్కిల్ పరిధిలోని పోలీసులు పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ రక్తధాన శిభిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎస్ఐలు నరసింహారావు, సుధాకర్ రెడ్డి, డక్కిలి ఎస్ఐ నాగరాజు, బాలాయపల్లి ఎస్ఐ వీరనారాయణ, డాక్టర్ జిలాని, డాక్టర్ వెంకటలక్ష్మి, గూడూరు బ్లడ్ బ్యాంక్ డాక్టర్ శ్రీనివాస్ సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష క్యాంపులు ద్వారా ఇంటి వద్దకే వైద్యం

బాలాయపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త



జగనన్న సురక్ష క్యాంపు ద్వారా ఇంటి వద్దకే పేదలకు వైద్యం అందుతున్నట్లు ఎంపిడిఓ రవీందర్ బాబు తెలిపారు. వెంగమాంబపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ రవీంద్రబాబు, ఎంఈఓ కిల్లా వెంకటేశ్వర్లు, ఈవోపిఆర్డి శ్రీనివాసులు, సర్పంచ్ బి. వెంకటసుబ్బయ్య, జగనన్న సురక్ష క్యాంపుల్లో, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ఇంటి వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరు జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పలువురు వ్యాధిగ్రస్థులకు, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసిన వైద్యాధికారిణి డా. ప్రమీల, డా. కళ్యాణ్ చక్రవర్తి, డా. హిమజ, సత్యప్రియ, ఆయేషా, పేద ప్రజలకు ఆరోగ్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజా స్పందన బాగుందని సర్పంచ్ బి. వెంకటసుబ్బయ్య తెలిపారు. పౌష్టికాహారం ప్రదర్శించి గర్భవతులకు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డా. కళ్యాణ్ చక్రవర్తి కోరారు.

## తడలో ఉచిత యోగా కేంద్రం

తడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త

ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తడలో యోగా కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎదురుగా యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ ప్రతి రోజు ఉచిత సహజ యోగ అభ్యాసనం నేర్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తన నిత్య జీవితంలో ఎదుర్కొనే మానసిక అలజడులు తద్వారా ఏర్పడే శారీరక రుగ్మతల నుంచి బయటపడవచ్చని చెప్పారు. ఆధ్యాత్మిక విలువలకు కూడా విలువ ఇస్తూ తమ సంస్థ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతుందని, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సెల్ నాయుడుపేట పట్టణ ఉపాధ్యక్షులుగా పవన్‌కల్యాణ్

పెళ్లకూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త




పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామానికి చెందిన నాయుడుపేట పట్టణ ఎస్సీ, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులుగా చింతపూడి పవన్ కల్యాణ్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ ఆన్సరి, జాతీయ కన్వీనర్ ప్రసన్ గోసామిలు నియామకపత్రాన్ని అందజేశారు. పవన్ కల్యాణ్‌కు పదవి లభించడం పట్ల పెళ్లకూరు మండలానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

## నవంబర్ 11న మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం

బాలాయపల్లి, అక్టోబర్ 30, ప్రభాతవార్త

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ నెల 11వ తేది ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ రవీంద్రబాబు తెలిపారు. సమావేశంలో విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకం ఇంకా పలు అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని చెప్పారు.

# తిరుపతి డివిజన్

## బాజపా అంబేద్కర్ ఆశయాలను నేరవేరుస్తోంది




తిరుపతి టౌన్ అక్టోబర్ 30 ప్రభాతవార్త : రాజ్యాంగ నిర్మాత డా, బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రధానినరేంద్రమోదీ నేరవేరుస్తున్నారని భాజపా ఎస్సీ మోర్చా నేషనల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బోలో సింగ్ అన్నారు.సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలో వైకాపా దారి మళ్లిస్తుందని ఆరోపించారు. కేంద్రం విడుదల చేసి పథకాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోటోలును వేసుకొంటున్నారని చెప్పారు.మరో నాలుగు నెలల్లో వైకాపాను ప్రజలు ఇంటికి పంపాతారని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నాగలాపురం విద్యార్ధులు ఎంపిక



నాగలాపురం, అక్టోబర్ 30, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సీఫున్నాల్, తభిత, వానిషలు అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక ఆయినట్లుగా ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య తెలిపారు. తిరుపతిలో సోమవారం జరిగిన జిలాస్థాయి బేస్బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, సురేంద్ర, విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## చెక్‌డ్యాం షట్టర్లుకు మరమ్మతులు చేయండి



నాగలాపురం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : మండల రైతులకు సాగునీరు అందిచే అరణియార్ ప్రాజెక్టు నుండి నల్లచెరువుకి వచ్చే కుడికాలువ చెక్‌డ్యాం షట్టర్లకు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం ఇరిగేషన్ ఏఈ బాలా జీకి తెదేపా నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కాలువ షట్టర్లు మరమ్మతులకు గురికావడం వల్ల ప్రతియేడు పంట చేతికివచ్చే సమయానికి నీటి ప్రవాహానికి పంట ముంపునకు గురౌతుందని సమస్యను వివరించారు. దీనివల్ల రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోనవలసి వస్తుందన్నారు. సానుకూలంగా స్పందించిన ఏఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకునిపోయి చెక్‌డ్యాం షట్టర్లకు మరమ్మతులను చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో తెదేపా నేతలు సెల్వకుమార్, రాజా, నాగరాజు, వెంకటేష, సుబ్రమణ్యంలో పాల్గోన్నారు.

## జనాభా విద్య విభాగంను నిర్వీర్యం చేసిన ఎస్వీయూ ఉన్నతాధికారులు

తిరుపతి (క్రీడా), అక్టోబర్ 30 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జనాభా విద్య విభాగంలో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టును ఆ విభాగంకు లేకుండా చేసిన ఎస్వీయూ ఉన్నతాధికారులు ఉమెన్ స్టడీస్ సబ్జెక్టును పాపులేషన్‌లో విలీనం చేయడం వల్ల పాపులేషన్‌లో పూర్తిగా ఉద్యోగాలు లేకుండా చేశారు. ఈ విభాగం 1973 సంవత్సరంలో ఏర్పడింది. అప్పట్నుంచి కొన్ని వేల మందికి విద్యా ఉపాధిని అందించిన విభాగంలో మొత్తం 110 పిహెచ్‌డిలు చేశారు. ఈ సంవత్సరంలో విభాగపు సన్నోత్సవాలు కూడా జరుపుకుంది. అయితే 2009లో ఏర్పడిన ఉమెన్ స్టడీస్‌ను ఈ విభాగంలో విలీనం చేయడం ద్వారా ఉన్న పోస్టులను ఆయుభాగముకే కేటాయించి పాపులేషన్‌కు అన్యాయం చేశారు. అయితే ఉమన్ స్టడీస్‌కు యుజిసి అప్రూవల్ కూడా లేదు. అది ఒక ఎక్స్టెన్షన్ ప్రోగ్రాం మాత్రమే యూజీసీ గుర్తింపు లేని సబ్జెక్టుకు ఎస్వీయూ ఉన్నతాధికారులు పోస్టుల కేటాయించడం ఎంత వరకు సమంజసం పాపులేషన్ విభాగం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తప్ప ఆంధ్రప్రదేశ్‌లో మరి ఎక్కడ లేదు రాబోవు నోటిఫికేషన్‌లో ఈ పోస్టులను పాపులేషన్‌లో పిహెచ్‌డి చేసిన వాళ్ళకే కేటాయించాలని అక్కడ విద్యార్థులను కోరారు.

## నవోదయలో 9, 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులకు

తిరుపతి (క్రీడా), అక్టోబర్ 30 ప్రభాతవార్త : జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయల్లో 2024 -25 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు నవంబర్ 7వ తేది వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్ధులు అర్హులని, 11వ తరగతి కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

## గూడూరు పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వినతి

### ఆర్‌డిఓకు వినతి పత్రం అందజేసిన తెలుగుదేశం, సిపిఐ పార్టీలు



గూడూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలో నెలకొని ఉన్న పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గూడూరు ఆర్డివోకి తెలుగుదేశం, సిపిఐ పార్టీల నాయకులు వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా తెలుగు దేశం, సిపిఐ పార్టీల నాయకులు మాట్లాడుతూ గూడూరు పట్టణంలో టిడ్కో ఇళ్ళలో నివాసం ఉంటున్న వారు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శానిటేషన్, లైటింగ్ కూడా సరిగా లేవని కనుక వెంటనే అక్కడ నివాసం ఉన్నవారికి తాగు నీరు, శానిటేషన్, లైటింగ్ సదుపాయాలు మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గూడూరు పాత బస్టాండ్‌కు గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారని, ప్రయాణీకులు అర్జెంటుగా టాయిలెట్ వెళ్లాలంటే మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే అక్కడ ఉన్న మరుగుదొడ్లను రీ ఓపెన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇటీవల గూడూరు పట్టణంలో గ్యాస్ పైప్ లైన్ కొరకు రోడ్లు ధ్వంసం చేస్తున్నారని, మున్సిపల్ ఏఈలు కానీ ఫిట్టర్లు కానీ దగ్గర లేకుండానే ఏజిపి కంపెనీ వారు రోడ్లు ఇష్టారాజ్యంగా పగలకొడుతున్నందున మంచి నీటి పైపులైన్లు పగిలి కొళాయిలలో మురికి నీరు ప్రవహిస్తూ ఉన్నాయని, ఈ కలుషితం నీరు వలన ప్రజలు పలు అంటు రోగాల భారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారని, వెంటనే ఈ రోడ్లన్నీ ప్యాచ్ వర్క్ పూర్తి చేయించాలని అన్నారు. ఈ విషయాలన్నీ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అయిన ఆర్డీవో గారి దృష్టికి తీసుకెళ్లామని, ఆర్డిఓ మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఈ సమస్యలన్నిటిని త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వీటిని పరిష్కరించనట్లయితే ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని అన్నారు.

**రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి త్వరగా పూర్తి చేయాలి..**

ఎన్నో సంవత్సరాలుగా అసంపూర్తిగా ఆగిపోయిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డివోని కోరామని ఆయన ఆర్అండ్‌బి అధికారులు, రైల్వే అధికారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ఒకటవ, రెండవ పట్టణాలకు నడకదారిన వెళ్లే ప్రజాలకు సౌకర్యార్థం నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద అడ్డంగా గోడ నిర్మించారని వెంటనే ఆ గోడ తీసి వేయించి పట్టణ ప్రజలు వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని చుట్టూ తిరిగి పోవాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలు సౌకర్యాలు అడ్డంగా కట్టిన గోడను తొలగించి మార్గం ఏర్పరిచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, టిడిపి తిరుపతి పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె కాలేషా, ఏఐటియుసి నాయకులు ఎంబేటి చంద్రయ్య, టిడిపి బిసి సెల్ నాయకులు పిల్లెళ్ళ శ్రీనివాసులు, రావుల శివప్రసాద్ గౌడ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తుడా వెంచర్‌లో ఆక్రమణదారులు

### తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు-ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన వైనం-ప్లాట్లు కొనుగోలుదారులు అధైర్యపడకండి - తుడా వీసీ వెల్లడి

తిరుపతి రవాణా, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పరిధిలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ విక్రయించిన ప్లాట్ కొనుగోలుదారులు అధైర్యపడాల్సిన అవసరం లేదని వీసీ హరికృష్ణ స్పష్టం చేసారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తుడా అభివృద్ధి చేసిన స్థలంలో లే ఔట్ వేసి ప్లాట్లు విక్రయించామని తెలిపారు. బాధితులకు పరిహారం చెల్లించి భూసేకరణ ప్రక్రియ ద్వారా భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం తుడా కార్యాలయంలో ఉపాధ్యక్షులు (విసి) హరికృష్ణ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వేదాంతపురం గ్రామమ పరిధిలోని తుడా లే అవుట్‌లో ఆదివారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా చొరబడటమే కాకుండా ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారన్నారు. వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు వీసీ తెలిపారు. వేదాంతపురం గ్రామ పరిధిలోని తుడా స్థలంకు సంబంధించి వివరాలను వెల్లడించారు. వేదాంతపురం సర్వే నెం. 196, 202, 203, 204 లో 25.22 ఎకరాల భూమిని 1992లో ప్రభుత్వ నిబంధనల మేరకు తుడా భూ సేకరణ పద్ధతి ద్వారా కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ కేటాయింపును సవాల్ చేస్తూ గతంలో హైకోర్టులో సి. శంకర్ రెడ్డి, ఇ. పుల్లారెడ్డి ఇతరులు రిట్ పిటిషన్లు దాఖలు చేయగా, వాస్తవిక పరిస్థితుల ఆధారంగా కోర్టు పిటిషన్లను కొట్టివేసిందన్నారు. ఇలా పలుమార్లు పిటిషన్‌లు దాఖలు చేశారని గుర్తు చేసారు. 2007లో సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా అక్కడ కూడా తుడాకు అనుకూలంగా అప్పీల్‌ను కొట్టివేసినట్లు వివరించారు. 2020లో శంకర్ రెడ్డి కొడుకు వంశీ వర్ధన్ రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేయగా సర్వే నెంబర్ 203లో 0.50 సెంట్లు స్థలంలో జోక్యం చేసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన కోర్టు, ఆ తరువాత 2023లో పిటిషన్ కొట్టివేసిందన్నారు. ఆ తరువాత కూడా కోర్టు అప్పీల్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ ఎటువంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. రెండు దశల్లో చేపట్టిన భూ సేకరణ ప్రక్రియలో పరిహారాన్ని బాధితుల బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేసినట్లు వివరించారు.

## వాహనాలను తప్పుడు మార్గంలో నడిపిన సిబ్బంది పై కఠిన చర్యలు

### డిపో మేనేజర్లకు జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశం

తిరుపతి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో తప్పుడు మార్గంలో బస్సులు నడిపిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డిపో మేనేజర్లతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి ప్రభుత్వం తుడా వారిచే శ్రీనివాస సేతు నుండి తిరుపతి బస్టాండ్ లోపలికి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా బస్సులు రావడానికి ఒక డౌన్ ర్యాంప్ రోడ్డు నిర్మించారని తెలిపారు. అలాగే ఈ డౌన్ ర్యాంప్ రోడ్డు బస్సులు తిరుపతి బస్టాండ్ లోపలి ప్రవేశించటానికి తప్ప తిరిగి వెళ్ళటానికి కాదని వారితో కచ్చితంగా తెలిపారు. కానీ కొంత మంది సిబ్బంది, ఇతరులు తమ వాహనాలను తప్పుడు మార్గంలో తిరుపతి బస్టాండ్ నుండి బయటికి పోవడానికి ఉపయోగిస్తున్నారన్నారు. వారు డౌన్ ర్యాంప్ రోడ్డు ద్వారా లోపలి వచ్చే వాహనాలకు ఎదురుగా నడుపుతున్నారని ఇదే చాల ప్రమాదకరం ఆక్సిడెంట్ అయ్యి బస్సులు వంతెనపై నుండి కిందకు పడేందుకు అవకాశం కలదని తమ ప్రాణాలు, ఇతరుల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారన్నారు.

డిపోలలో పని చేస్తున్న సిబ్బందికి డిపో మేనేజర్ల ఆదేశించాలని, వాహనాలను తప్పుడు మార్గంలో తిరుపతి బస్టాండ్ నుండి డౌన్ ర్యాంప్ రోడ్డు ద్వారా లోపలి వచ్చే వాహనాలకు ఎదురుగా నడుపుతూ బయటికి పోవటానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఏటిఎం, తిరుపతి బస్టాండ్ వారిని సిబ్బంది, ఇతరులు డౌన్ ర్యాంప్ రోడ్డును తిరుపతి బస్టాండ్ నుండి బయటికి వెళ్ళటానికి ఉపయోగించకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## జంతువధశాల, చేపల మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ



వరదయ్యపాలెం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : వరదయ్యపాలెం పంచాయతీలో నూతనంగా జంతు వధసాల, చేపల మార్కెట్ నిర్మాణానికి గోవర్ధనపురం పాముల కాలువ సమీపంలో సోమవారం భూమి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పది లక్షల రూపాయిలుతో పంచాయితీ నిధులతో జంతువధశాల నిర్మాణానికి ఈఓ బసిరెడ్డి వరదయ్యపాలెం ఎంపిపి భర్త దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శంఖు స్థాపన కార్యక్రమానికి జడ్పిటిసి వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ్యోతి రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్ మాజీ సర్పంచ్ చిన్నా తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొని భూమి పూజ చేసారు. ఎన్నో ఏళ్ల తర్వాత జంతువధశాలకు స్థలం, భవన నిర్మాణం చేపట్టడానికి కృషి చేసిన ఈవో ప్రజాప్రతి నిధులకు స్థానిక ప్రజలు మాంసం, చేపల విక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొప్పన చంద్రబాబు (చిన్ని) వార్డు సభ్యులు మునిభూషణమ్మ, కల్లూరు మోహన్ పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్దకు "నాణ్యమైన వంట పాత్రలు"

### ఎంఈఓ శ్రీవరం లలితకుమారి



చంద్రగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమానికి వంట పాత్రలను సరఫరా చేసినట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, ఎంపిటిసి రాజయ్య, ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా, ఎంఈఓ శ్రీవరం లలిత కుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు చేతుల మీదుగా ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు అంద జేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్ధి ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలనే ధృఢమైన సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి, జగనన్నగోరుముద్ద వంటి పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద కార్యక్రమానికి విద్యార్థుల సంఖ్య ఆధారంగా నాణ్యతా ప్రమాణాలతో కూడిన వంట పాత్రలను అందజేసినట్లు తెలిపారు. ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి లక్ష్య సాధనలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు భాగస్వాములై జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించా లన్నారు. విద్యార్ధుల మానసిక, శారీరక ఎదుగుదలకు మెనూ తప్పక పాటించాలన్నారు.

## విద్యార్థినికి ఉచిత ఆరోగ్యపరీక్షలు



నగరి, అక్టోబరు 30 ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్య సిబ్బంది విద్యార్థినులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం మహిళా సాధికారికత శాఖ ఆధ్వర్య ంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి ఐరన్, కాల్షియం, జింక్, బీ కాంప్లెక్స్, పారాసిట్మాల్, పేనాటాక్ మాత్రలను శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందించారు. విద్యార్థినుల ఆరోగ్యానికి తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. శరీరంలో హిమోగ్లోబిన్ పెంచుకోవడానికి ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎం.భాస్కర్‌రాజు, మహిళా సాధికారత విభాగం కౌన్సిలర్ ఇందిరాప్రియదర్శిని, అధ్యాపకులు భాస్కర్‌రాజు, అరుణకుమార్, పంకజ, సుహాసిని, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ రాష్ట్ర కార్యదర్శిగా చిరంజీవిరెడ్డి



తొట్టంబేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎంప్లా యిస్ యూనియన్‌కు రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతి జిల్లా తంగేళ్ళ పాళెం పిఎసిఎస్‌లో సిఈఓ పి.చిరంజీవి రెడ్డిని నియమిస్తూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా వ్యవహరించే తంగేళ్ళపాళెం పిఎసిఎస్ సిఈవో చిరంజీవిరెడ్డి వ్యవహరిస్తున్నారు. అటు రైతులు, ఇటు అధికారులు, సంస్థ ఛైర్మన్, సభ్యుల సహకా రంతో ముందుకు తీసుకెళ్తున్నారు. అంతేకాకుండా సొంత భవనం నిర్మాణా నికి రూ.45లక్షలు మంజూరు చేశారని, పిఎసిఎస్ పరిధిలో పెట్రోలు బంకును రామచంద్రాపురం గ్రామంలో ఏర్పాటు చేసేందుకు చర్యలుతీసుకుంటున్నామని ఇవన్నీ త్వరలోనే కార్యరూపం దాల్చను న్నారు. ఈసందర్భంగా చిరంజీవిరెడ్డిని పిఎసిఎస్ ఛైర్మన్ మణిబాబునాయుడు, సంస్థ అధికారులు అభినందించారు.

## ఓటర్ల జబితాపై టిడిపి పరిశీలన



పుత్తూరు, అక్టోబరు 30 ప్రభాతవార్త : పుత్తూరు రూరల్ మండల పరిధిలోని పలు పంచాయతీలకు సంబంధించి విడుదలైన ఓటర్ల ముసాయిదా జాబితాను సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో పంచాయతీల వారీగా నాయకులతో ఓటర్ల జాబితాను పరిశీలించారు. అక్కడక్కడ డబుల్ ఎంట్రీలు వున్నాయని, శిరుగురాజుపాలెం పంచాయతీలో మృతి చెందిన వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో వున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వీటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఎన్నికల అధికారులకు తమ అభ్యంతరాలను తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి బలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై టిడిపి కసరత్తు



విజయపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త : మండలంలో ముసాయిదా ప్రచురించిన ఓటర్ల జాబితాపై మండల టిడిపి నాయకులు కసరత్తు ప్రారంభించారు. మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయ కులు మురళీనాయుడు క్షూరికా పురంలో ఓటర్ల జాబితా పరిశీలించారు. అందరి ఓట్లు వున్నాయా, సవరణ వంటి అంశాలను పరిశీలించారు.

## గ్రావెల్ క్వారీపై స్పందనలో ఫిర్యాదు

విజయపురం, అక్టోబరు 30 ప్రభాతవార్త : మండలంలోని మహారాజపురంలో నిర్వహిస్తున్న గ్రావెల్ క్వారీపై సోమవారం మాజీ ఎంపిటిసి శివకుమార్ శ్రీహరిపురం సచివాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 185-12లో 0.73 హెక్టార్‌లో 10 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతి తీసుకుని ఇష్టానుసారం తరలించి ప్రభుత్వ భూములను ధ్వంసం చేస్తున్నారని దీనిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

## అర్హత కలిగి అనుభవంలో ఉన్న రైతులకు పట్టాలు మంజూరు చేయండి

### కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి



గూడూరు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : అర్హత కలిగి ఏళ్ల తరబడి అనుభవంలో ఉన్న చిన్న, సన్నకారు రైతులకు అసైన్ మెంట్ భూములకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో 4000 ఎకరాలు అసైన్‌మెంట్ భూమిని గుర్తించినా నేటికీ అర్హులకు అందని ద్రాక్షగానే ఉందన్నారు. వెంటనే అనుభవంలో ఉన్నవారికి పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. అలాగే అపరిష్కృతంగా ఉన్న నియోజకవర్గ సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు.


## సిమెంట్ కంపెనీ కాలుష్యం నుండి గ్రామాన్ని రక్షించండి

### -స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు తొండుకులి వాసుల వినతి



సత్యవేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : మండలంలోని తొండుకులి గ్రామంలో నిర్వహిస్తున్న బిఎల్‌ఎం సిమెంట్ కంపెనీ కాలుష్యం నుండి గ్రామాన్ని రక్షించాలంటూ గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బాలాజీకి పలువురు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండేళ్ళ క్రితం ఇక్కడ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేశారని, అప్పట్నుంచే గ్రామంలో కాలుష్య సమస్యలు మొదలయ్యాయని వాపోయారు. సర్వే నెం 88/1లో ఎకరా పదిసెంట్లులో బిఎల్‌ఎం విష్ణుచక్ర సిమెంట్ కంపెనీ నడుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకంపెనీకి 250 మీటర్ల దూరంలో గ్రామ వాసులు నివాసాలు ఉన్నాయన్నారు. వ్యవసాయ పొలాలు, పంటచెరువు ఈ కంపెనీ నుండి విడుదలయ్యే వ్యర్థాలు, దుమ్ము దూళితో కాలుష్య కోరల్లో చిక్కుకున్న పరిస్థితి ఉందన్నారు. కాలుష్య సమస్యలపై కంపెనీ యాజ మాన్యంను ప్రశ్నించిన రైతులు, గ్రామస్తులపై సిబ్బందితో తమపై భౌతిక దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. సత్యవేడు పోలీస్టేషన్‌లో కంపెనీ నిర్వాకంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు తమ గ్రామంలో పర్యటించి కాలుష్య సమస్యను పరిష్కరించాలని, ప్రామాణిక నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సిమెంట్ కంపెనీని మూయించాలని గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు మునికృష్ణయ్య, కస్తూరి, మునస్వామి, మణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గోన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణార్థం..శ్రీసిటీలో రక్తదాన శిబిరం



సత్యవేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురష్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీసిటీ పోలీసులు స్థానిక బిజినెస్ సెంటర్‌లో సోమవారం రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. శ్రీసిటీ డిఎస్పీ జగదీష్ నాయక్ ఈశిభిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమన మాట్లాడుతూ సమాజశ్రేయస్సులో పోలీసుల పాత్ర, వారి త్యాగాలను గురించి తెలియజేశారు. ప్రజారోగ్య ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీసిటీ యాజమాన్యం సహకారంతో ప్రతి యేడాది రక్తదాన శిభిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈశిభిరంలో రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమ ఉద్యోగులు, విద్యార్థులు, పరిసర ప్రాంత గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు త్యాగాలు వెలకట్టలేనిదని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సదేశంలో వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పరంగా వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా, రక్తానికి సంబంధించి ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేవన్నారు.అత్యవసర సమయాల్లో రోగులను బ్రతికించడంలో రక్తదానం అత్యంతకీలకమని పేర్కొన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించి వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఏటా రక్తదాన శిభిరాలను నిర్వహిస్తున్న శ్రీసిటీ పోలీసులను ఆయన అభినందించారు. నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్వో మధుసూదన్ రావు, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్ శిభిరాన్ని పర్యవేక్షించారు. శ్రీసిటీ కస్టమర్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, పెక్యూరిటి ఛీఫ్ రమేష్, సిఐ భాస్కర్, ఎస్ఐ అరుణ్ కుమార్ తదితరులు పాల్గోన్నారు.

# పంచాయతీ వార్షిక లెక్కల అవకతవకలపై విచారణ



వరదయ్యపాలెం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : వరదయ్యపాలెం మండలం ఇందిరానగర్ పంచాయతీ వార్షిక లావాదేవీలకు సంబంధించి 2016 నుండి 2023వ సంవత్సరం వరకు ఆడిపూడి ఆషా ఆర్‌టిఐ యాక్ట్ ద్వారా పొందిన సమాచారం మేరకు అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో ఆడిపూడి ఆషా, సిసిఆర్ ప్రతినిధి గుత్తి త్యాగరాజు తన సభ్యులతో తిరుపతి జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో పిర్యాదు చేయడం జరిగింది. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటరమణ రెడ్డి సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించారు. ఎటువంటి విచారణ జరగకుండా ఆన్‌లైన్‌లో పిర్యాదును క్లోజ్ చేయడంతో అధికారుల తీరుపై అసంతృప్తితో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తిరుపతి జిల్లా డిపిఓ రాజశేఖర్‌రెడ్డి స్వయంగా ఇందిరానగర్ పంచాయతీ నందు విచారణ జరిపి రికార్డులను స్వాధీనపరుచుకుని గూడూరు డిఎల్‌పిఓ వెంకటరమణను ప్రత్యేక విచారణ అధికారిగా నియమించారు. ఇందులో భాగంగా సోమవారం నాడు ఇందిరానగర్ పంచాయతీ కార్యాలయంలో డిఎల్‌పిఓ వెంకటరమణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. గతంలో పనిచేసిన, ప్రస్తుత పంచాయతీ సెక్రెటరీలు, ప్రస్తుత సర్పంచ్ సల్లా వీరభద్రయ్య ఈ విచారణకు హాజరు కాగా గత మాజీ సర్పంచ్ రసూల్ సాహెబ్ గైర్హాజరు అయ్యారు. విచారణలో భాగంగా ఆశ్చర్యం కలిగించే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కురింజల పంచాయితీకి చెందిన దాదాపు లక్ష రూపాయిల బిల్లును ఇందిరా నగర్ పంచాయతీ నుండి చెల్లించిన విషయం అధికారులు గుర్తించారు. ఇందిరానగర్ పంచాయితీ గృహనిర్మాణాల ఎన్‌ఓసిలకు సంబంధించి ఒక్కొక్కరికి ఒక్కో రకంగా ఇస్తున్న తీరుపై అధికారులను వివరణ కోరారు. పంచాయతీ కార్యాలయంలో ఉండవల్సిన రికార్డులు లేకపోవడాన్ని గుర్తించి అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. విచారణకు సంబంధిత వ్యక్తులను అందరిని పిలవమని విచారణ అధికారులు ఆదేశాలు జారీచేసినప్పటికీ స్థానిక పంచాయితీ కార్యదర్శి ముందస్తు అధికారిక సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

# ఆహార భద్రతకై వ్యాధికారకాల వైవిధ్యతను గుర్తించాలి

## -ఎస్వీ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మీ



తిరుపతిరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మొక్కలలో అధిక రకాలలో వైవిధ్యత కలుగుతుందని, ఆహార భద్రత సాధించాలంటే వ్యాధి కారకాల వైవిధ్యతను నిర్ధారించడం ఎంతైన అవసరరం ఉందన్నారు. శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ప్లాంట్ పెథాలజీ విభాగం, జాతీయ వ్యవసాయ ఉన్నత విద్య ప్రాజెక్టు సంస్థాగత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఆరురోజుల పాటు అధ్యాపకులకు, పిజీ విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మొక్కలకు సోకుతున్న వైరస్‌ను గుర్తించి, అందుకు అనుగుణంగా వ్యాధి నిరోధాకాలను గుర్తించాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డు సభ్యులు డాక్టర్ పి.వి. సత్య గోపాల్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు వ్యాధికారకాలలో కూడా మార్పు జరిగిన, తక్కువ ప్రాముఖ్యత కలిగిన వ్యాధులు ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకుంటున్నాయని, సరైన అవగాహన రావటానికి ఈ శిక్షణా కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత వివిధ రకాల పరిశోధనలు చేపట్టడానికి కావాల్సిన నైపుణ్యతను సాధించాలని సూచించారు. ప్రాంతీయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రమణ మాట్లాడుతూ కృత్రిమ మేథస్సు కూడా వ్యాధులను నియంత్రించడంలో సహాయ పడుతుందని, వీటిని సరైన పద్దతిలో వినియోగించాలన్నారు. ప్లాంట్ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ రెడ్డి కుమార్ శిక్షణ కార్యాక్రమం ఉఖ్య ఉద్దేశాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో ఐదు రాష్ట్రాల నుండి 9 విశ్వవిద్యాలయాల నుండి విచ్చేసిన ట్రైనీలు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షంతో రోడ్లన్నీ జలమయం

కోట, అక్టోబర్ 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని కోట, విద్యానగర్, కొత్తపాలెం, గూడలి, తిన్నెలపూడి, వెంకన్నపాలెం తదితర గ్రామాల్లో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.30 గంటల వరకు రెండువిడతలుగా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యానగర్‌లోని కళాశాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో వర్షపునీరు ఆ గుంటల్లో చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఇదే క్రమంలో రోడ్ల పక్కన డ్రైనేజి కాలువలు నిండిపోయి గూడూరు-కోట రోడ్డుపై బాలభారతి నుంచి మాగుంట క్వార్టర్స్ వరకు రోడ్డుపైనే డ్రైనేజి నీరు పారడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఈ మురికి నీటిలోనే ద్విచక్ర వాహనదారులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## దొరవారిసత్రంలో వర్షం - ఊపిరిపీల్చుకున్న వరిపంట

దొరవారిసత్రం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : దొరవారిసత్రం ప్రాంతంలో సోమవారం భారీ వర్షం కురిసింది. భగభగ మండుతున్న వేడిసెగల నేపథ్యంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మెట్ట ప్రాంతాల్లో వేసిన వరిపంట పూర్తిగా ఎండిపోతుండటంతో ఒక్కసారిగా కురిసిన వర్షంతో వరిపంటకు ఊపిరి పోసినట్లయింది. మండల పరిధిలోని అక్కరపాక, సూరపు అగ్రహారం, గొల్లపాలెం, కల్లూరు, ఏకొల్లు, నెలబల్లి తదితర గ్రామాలతో పాటు మెట్ట ప్రాంతాల్లో వేసిన ఎలిది పైర్లకు వర్షం కురవడంతో ఊపిరి పోసినట్లయింది. రైతులు సంతోషంగా ఉన్నారు. ఎలిది పైరు వేసిన 40 రోజులు పూర్తవుతున్నా వర్షం పడకపోవడంతో వరిపంట ఎండుముఖం పట్టి రైతులు నిరాశ చెందారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి రైతులు సమాయత్తం అయ్యారు.

## పాలకమండలి సభ్యుడు గోపీ ప్రమాణ స్వీకారం




కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా గోపీ ప్రమాణ స్వీకారం చేశారు. కాణిపాకం దేవస్థానం రెండవ దఫా నూతన పాలకమండలి ఈనెల 17న ప్రమాణ స్వీకారం చేసి కొలువుదీరిన విషయం విధితమే ఈమేరకు 15 మంది ట్రస్టీలతో కూడిన నూతన పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో సభ్యుడిగా రెండవ దఫా నియమితులైన గోపీ సోమవారం దేవస్థానం అతిథి గృహం నందు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. గోపీ చేత ఆలయ ఈఓ వెంకటేశు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూపోటు, పడితరం స్టోర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో నూతన ఓగా నిర్మిస్తున్న లడ్డూపోటు, పడితరం గోడౌన్ నూతన భవనాన్ని వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆలయఈఓ వెంకటేశు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న ఈభవనానిన్న ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా భవనంలో పెండింగ్ పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరిగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు అర్ధవంతమైన పరిష్కారం చూపండి :ఆర్డీఓ



తిరుపతిరూరల్, అక్టోబర్ 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వినతులకు అధికారులు అర్ధవంతమైన పరిష్కారం చుపాలని సంబంధిత అధికారులను తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందినట్లు తెలిపారు. తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యలను ఆయా సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన వినతులదారులకు అర్థవంతమైన, పారదర్శకంగా పరిష్కారం ఉండేలా చూడాలన్నారు. స్పందన కార్యక్రమానికి అందిన వినతులను అన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేనాడుదీవిలో పౌరహక్కుల దినోత్సవం



తడ, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తడ మండలం వేనాడు దీవిలోని ఆలాపత్రి ఎస్టీ కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ కటారి జయ జయరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పౌర హక్కుల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆలాపత్రిలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పనిచేసే విధానాన్ని రాబట్టారు. సర్పంచ్ కె.అన్నపూర్ణ, ఎంపిటిసి కె.నదియా, రామాపురం వైద్యాధికారి మస్తాన్, ఎపిఎం రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, విఆర్‌ఓ ప్రసాద్, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



వెంకటగిరి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యదర్శిగా వెంకటగిరికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు నియమించారు. చిత్తూరులో జరిగిన అఖిలభారత సంచార జాతుల అభివృద్ధి మండలి సమావేశంలో ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా అఖిలభారత సంచార జాతుల బోర్డు సభ్యులు భరత్ భాయ్ నియమించారు. సంచార జాతుల సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తానని కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సంచార జాతుల వారందరినీ ఏకం చేస్తానని చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నాయుడుపేట, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నాయుడుపేటలోని మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మోటార్‌బైక్‌ను మినీ లారీ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం నాయుడుపేట నుంచి దయానందం అనే వ్యక్తి మోటార్‌బైక్‌పై పుదూరు వైపు వెళుతున్న క్రమంలో మల్లాం జాతీయ రహదారి వద్ద సూళ్లూరుపేట వైపు నుంచి నాయుడుపేటకు వస్తున్న మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో దయానందం అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వాహ్ " మజా " ఆయాగా...!



చౌడేపల్లి, అక్టోబర్ 30 ప్రభాతవార్త : అందరూ చూస్తుండగానే వానరం శీతల పానీయ దుకాణం నుంచి మాజా ప్యాకెట్‌ను తీసుకొచ్చింది. బస్టాండులో జనసంచారం అధికంగా వున్న ప్రాంతంలోని చింతచెట్టుపై కూర్చొని మాజా ప్యాకెట్‌ను ఖాళీ అయ్యేంత వరకు జుర్రుకొని తాగింది. రోడ్డుపై నుంచి వెళ్ళే వారందరూ ఈ సన్నివేశాన్ని ఆసక్తిగా చూసారు.

## కాణిపాకంలో నిరంతర భజన కార్యక్రమాలు ప్రారంభించాలి



కాణిపాకం, అక్టోబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో నిరంతర భజన కార్యక్రమాలను ప్రారంభించాలని జానపద వృత్తి కళాకారుల సంఘం సోమవారం కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక శ్రీవరదరాజస్వామి ఆలయంలో జానపద వృత్తి కళాకారుల సంఘం సమావేశం జరిగింది. ఈసందర్భంగా దేవస్థానంలో నవంబర్ 18 ఉదయం 11 గంటల నుండి 19 తేదీ ఉదయం 11 గంటల వరకు 24 గంటల పాటు నిరంతర కళాప్రదర్శనలు నిర్వహించాలని తీర్మానించారు. ఈమేరకు ఆలయ ఛైర్మన్, ఈఓలకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్ర పీఠాదీశులు శ్రీవిజయశంకరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరళి, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.సురేంద్రన్, అధ్యక్షుడు కెఎస్.రామచంద్రన్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రాజేంద్రనాయుడులతో పాటు పలువురు జిల్లా నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

## శానిటిరీ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల దగ్గర ప్లాట్లు ఇస్తామని డబ్బులు వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిఐటియు నగర కమిటి ఆధ్వర్యంలో కమిషనర్ హరితకు వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణం,నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌లు మాట్లాడుతూ కార్పొరేషన్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న శానిటిరి ఇన్స్‌పెక్టర్ ఇళ్ల స్థలాలు ఇపిస్తామని కార్మికుల దగ్గర వాహన డ్రైవర్లు వద్ద డబ్బులు వసూళ్లు చేస్తున్నారని వారు ఆరోపించారు. కార్మికులందరికి ఇళ్ల స్థలాలు మంజారు చేయాని వారు కోరారు.కార్మికుల నుంచి వసూళ్లు చేసిన డబ్బులును తిరిగి ఇవ్వాలని వారు కోరారు. అక్రమాలు జరగకుండా చూడలని వారు కోరారు.ఈ కార్య క్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు మునిరాజ,బుజ్జి, తంజారు మురళి ప్రసాద్, వాసు,తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్సులో ఆయధ పూజ



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్30 ప్రభాతవార్త : తిరుపతిలోని కపిలితీర్థం టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఎర్రచందనం పరిరక్షణలో భాగంగా ఉపయోగించి ఆయుధాలు, వాహనాలకు పోలీస్ స్టేషన్‌లో పూజలు చేశారు. గన్‌లు, తుపాకులకు, నిల్వ ఉంచే స్టోర్సు రూమ్‌లో దుర్గామాతకు శాస్త్రోంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి చెంచుబాబు, ఆర్ఐ.సురేష్,కూబింగ్‌లో పాల్గొనే సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన చేసిన ఎస్పీ, చక్రవర్తి:
పోలీసుల అమల వీరుల దినోత్సవంలో భాగంగా టాస్క్ ఫోర్సు సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వమిచారు.ఎస్పీ చక్రవర్తి ఆధ్వర్యం జరిగిన రక్తదాన శిబిరలో 21 యూనిట్లు రక్తాని సేకరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత,సిబ్బంది, పాల్గొన్నారు.

## స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు : జెసి బాలజీ

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధిలో ప్రజల అంద చేసిన అర్జీలను పరిష్కారం చూపాలని జెసి బాలజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జెసి డి.బాలజీ ,ఆర్ఓ పెంచల్ కిషోర్, ఎస్‌డిసిలు లీగల్ సెల్ సెల్ శ్రీనివాసులు, ఏపీఐఐసీ శ్రీనివాసులు ఫ్రోటో కాల్ భాస్కర్ నాయుడు తో కలిసి స్పందన గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకిరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చున అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. స్పందన్ అన్‌లైన్ నమోదుతో రసీదులు ఇచ్చారు. వివిధ శాఖల కలిసి 172 వినతులను స్వీకరించారు.

## స్పందన ద్వారా వచ్చిన సమస్యలకు తక్షణ చర్యలు : ఎస్పి



తిరుపతి క్రైం, అక్టోబర్ 30 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలకు తక్షణ చర్యలు చేపడుతామని ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను ఖుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించ కూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ప్రజలు ఫిర్యాదులు చేసారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 68 మంది వచ్చి వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువు లోపు ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్ల నందు ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కు విశేష స్పందన : మేయర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 30 ప్రభాతవార్త : నగరపాలక పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష విబిరాలకు విశేష స్పందన లబిస్తుందని నగర పాలక సంస్థ మేయర్ డా.శిరీష్ అన్నారు. సోమవారం జీవకోన గురు కృప స్కూల్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా నగర్ మేయర్ శిరీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు ఎఎన్‌ఎంలు వెళ్లి ఎవరెవరికి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో ముందుగా గుర్తించి అటువంటి వారిని శిబిరాలకు తీసుకొచ్చి వారికి వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్రంలో పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సురక్ష ద్వార 172 నరాల మందుల్ని ఈ విభిరాల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సూపర్‌డెంట్ రవి, రమేష్, వైకాపా నాయకులు రాజేంద్ర, వైద్యులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఏడు వందల సంవత్సరాల చరిత్ర... అగస్తీశ్వరాలయ వైభవం




తొట్టంబేడు, అక్టోబర్ 30 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలోని అగస్తీశ్వరాలయం ఎంతో ప్రసిద్దిచెందింది. ప్రతి ఏడాది మహాశివరాత్రి రోజున ఇక్కడి ఆలయంలో ఐదు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సుమారు ఏడువందల సంవత్సరాల క్రితం చోళరాజులు అగస్తీశ్వరాలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయానికి ఇక్కడ జరిగే స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవానికి శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ.

**స్థల పురాణం :**
అగస్త్యమహాముని శివునిపై అలిగి వస్తుండగా మార్గమధ్యంలో పెద్దకన్నలి గ్రామం వద్ద కంటిచూపు పోయింది. తన తప్పును తెలుసుకున్న అగస్త్యముని ఇక్కడే శివుని ప్రతిమను ఏర్పాటు చేసుకుని పూజించాడు. అగస్త్యుని భక్తికి మెచ్చిన పరమేశ్వరుడు కంటిచూపును ప్రసాదించాడు. ఈకారణంగా ఇక్కడి ఆలయానికి అగస్తీశ్వరాలయంగా పేరు స్థిరపడింది. అగస్త్యమునికి కంటిచూపు లభించడం వల్ల తొలుత ఈ గ్రామాన్ని కనులుగా పిలవడం మొదలుపెట్టారు. కాలక్రమేణా కన్నలిగా మారింది. గ్రామం పెద్దది కావడంతో పెద్దకన్నలిగా రూపుదిద్దుకుంది. అలాగే శ్రీకాళహస్తీశ్వరుని త్రిశూలస్నానం అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపున గల అగస్తీశ్వరుని దర్శనం చేసుకుంటే శ్రేయస్కరమణి పురాణాలు ఘోషిస్తున్నాయి. చోళరాజుల కాలంలో నిర్మితమైన అగస్తీశ్వరాలయం శిల్పసౌందర్యం అబ్బురపరుస్తోంది. ఆలయ లోపలి భాగంలో రాతి బండలమీద చెక్కబడిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలతో పాటు రాతిపై చేపబొమ్మలు చెక్కడాలు ఏదో సూచిస్తున్నట్లుగా భావిస్తున్నారు. అయితే ఆచేపల బొమ్మల భావం మాత్రం ఇక్కడెవరికీ తెలికపోవడం గమనార్హం. దక్షిణవైపున ఏర్పాటు చేసిన ముఖద్వారానికి రెండుపక్కల కాపలాగా ద్వారపాలకులు ఉన్నారు. గర్భాలయానికి దక్షిణాన దక్షిణామూర్తి, పడమర బ్రహ్మ, ఉత్తముఖాన దుర్గాదేవి, మహావిష్ణువుల విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ఆలయానికి తూర్పున గల ధ్వజస్తంభ దర్శనంతో గుడి చుట్టు ప్రదక్షిణం చేసి స్వామివారి సేవలో భక్తులు పాల్గొనడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.